




# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

బుధవారం,
మే 27, 2026

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-




## 4 రోజుల్లో ప్రభుత్వ భూమి ప్రైవేటు పేర్లకు మారింది

### ::: హరీశ్‌రావు

వెయ్యి కోట్ల ప్రభుత్వ భూముల అక్రమ బదలాయింపుల ఆరోపణలు

సిట్ లేదా సీఐడీతో సమగ్ర దర్యాప్తు చేయాలన్న డిమాండ్

తహసీల్దార్ బదిలీతో సరిపెట్టొద్దని ప్రభుత్వంపై విమర్శలు

భూ భారతి నమోదులపై అనుమానాలు వ్యక్తం చేసిన ప్రతిపక్షం

హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం పెద్దషాపూర్‌లోని ప్రభుత్వ భూముల వ్యవహారంపై బీఆర్ఎస్ తీవ్ర ఆరోపణలు చేసింది. సర్వే నంబర్లు 173 నుంచి 183 వరకు ఉన్న సుమారు 170 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టే ప్రయత్నం జరిగిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ఆరోపించారు. ఈ భూముల విలువ సుమారు రూ.వెయ్యి కోట్ల వరకు ఉంటుందని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై సిట్ లేదా సీఐడీతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డితో కలిసి మంగళవారం మీడియాతో మాట్లాడిన

(మిగతా 2వ పేజీలో)

# గ్రామపాలనకు కొత్త దిశ

## పంచాయతీల ఆర్థిక స్వయం ప్రతిపత్తిపై ప్రభుత్వం దృష్టి

గ్రామపంచాయతీల ఆదాయం నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమకు నిర్ణయం

గ్రామస్థాయి సిబ్బందికి ప్రతి నెల తొలి తేదీన జీతాలే లక్ష్యం

పెన్షన్ వ్యవస్థలో సంస్కరణలకు సీఎం కీలక ఆదేశాలు

ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల వేతనాలపైనా ప్రత్యేక దృష్టి

స్థానిక సంస్థల ఆర్థిక బలోపేతానికి చట్ట సవరణల దిశగా అడుగులు

అర్హులకే సంక్షేమ పథకాలు అందేలా డేటా ఆధారిత విధానంపై కసరత్తు



హైదరాబాద్: గ్రామపంచాయతీల ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక చర్యలకు శ్రీకారం చుట్టింది. గ్రామపంచాయతీలు సేకరించే సొంత ఆదాయాన్ని ఇకపై ట్రెజరీ ఖాతాల ద్వారా కాకుండా నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేసే విధానాన్ని అమల్లోకి తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. స్థానిక సంస్థలకు ఆర్థిక స్వయం ప్రతిపత్తి కల్పించడం, గ్రామస్థాయి పాలనలో పారదర్శకత పెంచడం, అభివృద్ధి పనులకు వేగం తీసుకురావడం లక్ష్యంగా ఈ మార్పులు చేపట్టనున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల పనితీరుపై నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. గ్రామపంచాయతీల ఆదాయ వనరులు బలపడకపోతే గ్రామాభివృద్ధి ఆశించిన స్థాయిలో జరగదని ఆయన స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. గతంలో అమల్లో ఉన్న కొన్ని విధాన మార్పుల కారణంగా పంచాయతీల ఆర్థిక స్వతంత్రత దెబ్బతిన్నదని భావిస్తున్న ప్రభుత్వం, ఇప్పుడు వాటిని పునరుద్ధరించే దిశగా అడుగులు వేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న గ్రామపంచాయతీ సిబ్బందికి ప్రతి నెల మొదటి తేదీన జీతాలు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సీఎం అధికారులను ఆదేశించారు. గ్రామస్థాయిలో పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాలు, పన్నుల సేకరణ, గ్రామ పరిపాలన వంటి బాధ్యతలు నిర్వహిస్తున్న సిబ్బంది వేతనాల్లో ఆలస్యం జరగడం సరైంది కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఉన్నతాధికారులకు సమయానికి జీతాలు అందుతున్నట్లే గ్రామస్థాయి ఉద్యోగులకూ అదే గౌరవం దక్కాలని పేర్కొన్నారు. ఈ క్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది

(మిగతా 2వ పేజీలో)



## ఐపీఎల్-2026 ఫైనల్లోకి దూసుకెళ్లిన ఆర్సీబీ... గుజరాత్‌కు మరో చాన్స్



## డ్రైవర్‌పై వేటు వెనక్కి..

విధుల్లో కొనసాగించాలని మంత్రి పొన్నం ఆదేశం

డ్రైవర్ అశోక్‌ను తొలగించాలన్న నిర్ణయాన్ని మార్చుకోవాలని మంత్రి పొన్నం సూచన

రైతుల పక్షాన మాట్లాడటాన్ని స్వాగతిస్తున్నామన్న రవాణా శాఖ మంత్రి



## పోక్సో కేసు: బండి భగీరథ్‌కు 3 రోజుల పోలీస్ కస్టడీ

పోక్సో కేసులో బండి సంజయ్ కుమారుడు భగీరథ్‌కు మూడు రోజుల పోలీసు కస్టడీ

7 రోజుల కస్టడీ కోరిన పోలీసులు..

3 రోజులకే అనుమతించిన మల్కాజ్‌గిరి కోర్టు



## మంచిర్యాల జిల్లాలో రూ.2 కోట్ల బీమా డబ్బు కోసం భర్తను చంపించిన భార్య!

రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు విఫలయత్నం

ప్రియుడితో కలిసి రూ.10 లక్షల సుపారీ ఇచ్చినట్లు పోలీసుల వెల్లడి

భార్య భారతి, ప్రియుడు సురేందర్‌తో పాటు మరొకరి అరెస్ట్

ప్రధాన నిందితుడు పరారీలో ఉన్నట్లు తెలిపిన పోలీసులు



## తెలంగాణ గవర్నర్‌ను కలిసిన కవిత... రేవంత్ సర్కారుపై ఫిర్యాదు

రాష్ట్ర ప్రభుత్వ భూసేకరణ కారణంగా నిరాశ్రయులైన బాధితులకు న్యాయం చేయాలని తెలంగాణ రక్షణ సమితి (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కె. కవిత గవర్నర్‌ను కోరారు. మంగళవారం ఆమె ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షుడు విశారదన్ మహరాజ్, పలువురు బాధితులతో కలిసి గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను లోక్‌భవన్‌లో కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు ఒక వినతిపత్రం సమర్పించారు. ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో ఇళ్లు కూల్చివేతకు గురైన బాధితులందరికీ ఇంటి స్థలాలు కేటాయించాలని, పరిగి మండలం కడ్లాపూర్‌లో ఇండస్ట్రియల్ పార్క్ కోసం జారీ చేసిన భూసేకరణ నోటీసును రద్దు చేయాలని వారు గవర్నర్‌ను కోరారు. అలాగే, రీజినల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్) అలైన్‌మెంట్ మార్పు, ఇతర భూసేకరణ సమస్యలను కూడా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. గవర్నర్‌తో భేటీ అనంతరం కవిత మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మహిళల ఇళ్లను కూల్చివేస్తున్నారని, రేవంత్ రెడ్డి ఒక నిర్దయుడైన ముఖ్యమంత్రి అని, కాంగ్రెస్ ప్రభుత్వం దుర్మార్గమైన పాలన అందిస్తోందని ఆమె విమర్శించారు. వంద రూపాయల చీరలు పంచి బాధితులను లక్షాధికారులను చేశానని సీఎం అబద్ధాలు చెబుతున్నారని ఆరోపించారు. తమ పోరాటాల ఫలితంగా వెలుగుమట్ల బాధితులకు అదే స్థలంలో భూమి కేటాయించడానికి ప్రభుత్వం

(మిగతా 2వ పేజీలో)

## కర్ణాటకలో నాయకత్వ మార్పు చర్చలు.. ఢిల్లీలో కాంగ్రెస్ హైడ్రామా

సిద్ధరామయ్య రాజీనామాపై జోరుగా ప్రచారం

డీకే శివకుమార్‌కు సీఎం బాధ్యతలు అప్పగించే అవకాశం

జాతీయ రాజకీయాల్లో కీలక పాత్రకు సిద్ధరామయ్యను ఒప్పించిన అధిష్టానం?

ఢిల్లీలో ఖర్గే, రాహుల్‌తో ఇద్దరు నేతల కీలక సమావేశం

సీఎం మార్పుపై అధికారిక ప్రకటన మాత్రం చేయని కాంగ్రెస్

రాజ్యసభ ద్వారా జాతీయ రాజకీయాల్లోకి సిద్ధరామయ్య ఎంట్రీపై ఊహాగానాలు



న్యూఢిల్లీ/బెంగళూరు: కర్ణాటక కాంగ్రెస్‌లో నాయకత్వ మార్పుపై ఊహాగానాలు మరింత వేడెక్కుతున్నాయి. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పదవికి రాజీనామా చేసే అవకాశాలపై రాజకీయ వర్గాల్లో చర్చ జోరుగా సాగుతోంది. కాంగ్రెస్ అధిష్టానం సూచనల మేరకు త్వరలోనే రాష్ట్రంలో నాయకత్వ మార్పు జరిగే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు ముఖ్యమంత్రి బాధ్యతలు అప్పగించే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయని సమాచారం. సిద్ధరామయ్య బుధవారం బెంగళూరులో మీడియా సమావేశం నిర్వహించనున్నట్లు

(మిగతా 2వ పేజీలో)



## 45 ఏళ్ల తర్వాత పోలీసుల ఎదుట మావోయిస్ట్ నరహరి లొంగుబాటు..

వివరాలు వెల్లడించిన డీజీపీ సీవీ ఆనంద్!

మే 12న లొంగిపోయిన నరహరి, ఆయన భార్య ధనమ్మ

ఈరోజు మీడియా ముందు ప్రవేశపెట్టిన పోలీసులు

దేశవ్యాప్తంగా ఇంకా 47 మంది అజ్ఞాతంలో : డీజీపీ ఆనంద్

# గ్రామపాలనకు కొత్తదిశ



జీతాల చెల్లింపుల కోసం ప్రతి నెల ప్రత్యేక నిధులు విడుదల చేసే అంశంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. వేతనాల చెల్లింపులో ఎలాంటి ఆలస్యం సహించబోమని సీఎం స్పష్టం చేసినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. కేవలం పంచాయతీ సిబ్బందికే కాకుండా ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ విధానంలో పనిచేస్తున్న ఉద్యోగులకు కూడా సమయానికి జీతాలు అందేలా అన్ని శాఖలు చర్యలు తీసుకోవాలని సూచనలు వెళ్లినట్లు తెలుస్తోంది. గ్రామీణ సంక్షేమ పథకాల అమలులో కీలకమైన పెన్షన్ వ్యవస్థలో కూడా ప్రభుత్వం మార్పులకు సిద్ధమవుతోంది. ప్రస్తుతం అమలులో ఉన్న విధానాన్ని సమీక్షించి, పెన్షన్ మొత్తాన్ని నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసే విధానం తీసుకురావాలని అధికారులకు సూచించినట్లు సమాచారం. ఈ విధానం ద్వారా మధ్యవర్తిత్వం తగ్గడంతో పాటు పారదర్శకత పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. అర్హులకే పింఛన్లు అందేలా డేటా ఆధారిత పరిశీలన చేపట్టాలని సీఎం సూచించారు. ఓటర్ ఐడీ, ఆధార్, కులగణన సమాచారం వంటి వివరాలను అనుసంధానం చేసి సంక్షేమ పథకాల పంపిణీలో స్పష్టత తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా కొత్త పెన్షన్ల మంజూరులో ఒంటరి మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నట్లు తెలుస్తోంది. స్థానిక సంస్థల ఆర్థిక వనరులపై గతంలో జరిగిన విధాన మార్పుల కారణంగా గ్రామపంచాయతీలు స్వయం ఆధారితంగా పనిచేసే సామర్థ్యం తగ్గిందన్న అభిప్రాయం ప్రభుత్వంలో వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో గ్రామపంచాయతీలకు సంబంధించిన చట్టాల్లో సవరణలు చేసి, సొంత ఆదాయంపై వాటి హక్కులను పునరుద్ధరించే దిశగా ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఇందుకోసం ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకురావాల్సి ఉండొచ్చని అధికార వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం శాసనసభ సమావేశాలు లేని కారణంగా ముందుగా ఆర్డినెన్స్ రూపంలో నిర్ణయాలు అమలు చేసి, తర్వాత అసెంబ్లీలో చట్టసవరణ బిల్లుగా ప్రవేశపెట్టే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. గ్రామస్థాయి పాలనలో ఆర్థిక క్రమశిక్షణ, పారదర్శకత, స్థానిక అవసరాలకు తగిన నిధుల వినియోగం వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు సమాచారం. గ్రామపంచాయతీల సొంత ఆదాయం పెరగడం ద్వారా స్థానికంగా రోడ్లు, పారిశుధ్యం, తాగునీటి సదుపాయాలు, చిన్నపాటి మౌలిక వసతుల అభివృద్ధికి ఊతమిస్తుందని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటివరకు నిధుల కొరతతో అనేక గ్రామాల్లో అభివృద్ధి పనులు నెమ్మదించిన నేపథ్యంలో, ఈ కొత్త విధానం గ్రామస్థాయి పాలనకు కొంత ఊరటనివ్వొచ్చని అంచనా వేస్తున్నారు. ఇక ఉద్యోగుల వేతనాలు, పెన్షన్ వ్యవస్థ, స్థానిక సంస్థల ఆదాయ వనరులు, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలను ఒకే దిశగా సమన్వయం చేస్తూ గ్రామీణ పరిపాలనను పునర్వ్యవస్థీకరించాలన్న ఆలోచనతో ప్రభుత్వం ముందుకెళ్తున్నట్లు స్పష్టమవుతోంది. రాష్ట్రవ్యాప్తంగా గ్రామస్థాయి వ్యవస్థలను బలోపేతం చేయడమే లక్ష్యంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల్లో మరిన్ని సంస్కరణలు తీసుకురానున్నట్లు అధికార వర్గాలు సంకేతాలు ఇస్తున్నాయి.

# డ్రైవర్‌పై వేటు వెనక్కి.. విధుల్లో కొనసాగించాలని మంత్రి పొన్నం ఆదేశం

**డ్రైవర్ అశోక్‌ను తొలగించాలన్న నిర్ణయాన్ని మార్చుకోవాలని మంత్రి పొన్నం సూచన**

**రైతుల పక్షాన మాట్లాడటాన్ని స్వాగతిస్తున్నామన్న రవాణా శాఖ మంత్రి**

**పెట్రోల్ ధరలపై నిరసన కన్నా, ధాన్యం కొనాలని కాంగ్రెస్ నేతలకు డ్రైవర్ సలహా**

**డ్రైవర్‌ను తొలగించడంపై బీఆర్ఎస్, ఇతర విపక్షాల నుంచి తీవ్ర విమర్శలు**

**ఫిర్యాదుతో డ్రైవర్‌ను విధుల నుంచి తప్పించాలని ఆర్టీసీ డిపో మేనేజర్ లేఖ**



హైదరాబాద్: కాంగ్రెస్ నేతల నిరసనపై విమర్శలు చేశాడన్న ఆరోపణలతో ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్‌ను తొలగించడంపై చెలరేగిన వివాదానికి తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెరదించారు. డ్రైవర్ అశోక్‌పై తీసుకున్న చర్యను వెనక్కి తీసుకోవాలని, అతడిని విధుల్లో కొనసాగించాలని యాజమాన్యానికి సూచించినట్టు ఆయన మంగళవారం తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. "డ్రైవర్ అశోక్ ఆర్టీసీ ఉద్యోగి కాదు, కేవలం అద్దె బస్సు డ్రైవర్ మాత్రమే. అయినప్పటికీ, అతను రైతుల పక్షాన మాట్లాడాడు. దానిని మేము స్వాగతిస్తున్నాం. అందుకే అతడిని ఉద్యోగం నుంచి తొలగించవద్దని బస్సు యాజమాన్యానికి సూచించాం" అని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలు విషయంలో కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా, రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకోవడానికి అన్ని చర్యలు తీసుకుంటోందని, ఈ విషయాన్ని విపక్షాలు రాజకీయం చేయవద్దని హితవు పలికారు.

**అసలేం జరిగిందంటే..**

సోమవారం జగిత్యాల నుంచి ధర్మపురికి బస్సు నడుపుతున్న సమయంలో, పెట్రోల్, డీజిల్ ధరల పెంపును నిరసిస్తూ కాంగ్రెస్ నేతలు, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ చేపట్టిన ధర్నాపై డ్రైవర్ అశోక్ స్పందించారు. నిరసనల కన్నా రైతుల నుంచి మొక్కజొన్న, పత్తి వంటి పంటలను కొనుగోలు చేయడంపై దృష్టి పెట్టాలని ఆయన సూచించినట్టు తెలిసింది. ఈ వ్యాఖ్యలపై స్థానిక కాంగ్రెస్ నేత ఒకరు ఫిర్యాదు చేయడంతో, డ్రైవర్‌ను తక్షణమే విధుల నుంచి తప్పించాలని బస్సు యజమానికి జగిత్యాల డిపో మేనేజర్ లేఖ రాశారు. ఈ ఘటనపై బీఆర్ఎస్ నేతలు హరీశ్ రావు, కవిత తీవ్రంగా స్పందించారు. ప్రశ్నించిన వారి ఉద్యోగాలు తీసేయడం అప్రజాస్వామికమని విమర్శించారు. బీఆర్ఎస్ నేతలు గంగుల కమలాకర్, జీవన్ రెడ్డి.. ఆర్టీసీ రీజనల్ మేనేజర్‌ను కలిసి అశోక్‌ను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. విపక్షాల నుంచి తీవ్ర విమర్శలు రావడంతో ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది.

# కర్ణాటకలో నాయకత్వ మార్పు చర్చలు.. ఢిల్లీలో కాంగ్రెస్ హైడ్రామా



తెలుస్తోంది. ఈ సమావేశంలో తన రాజకీయ భవిష్యత్తు, తాజా పరిణామాలపై ఆయన స్పష్టత ఇచ్చే అవకాశం ఉందని కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి. గత కొంతకాలంగా సీఎం సిద్ధరామయ్య, డీకే శివకుమార్ మధ్య అంతర్గత విభేదాలు కొనసాగుతున్నాయన్న ప్రచారం జరుగుతుండగా, ఇప్పుడు అధిష్టానం జోక్యంతో ఈ అంశానికి ముగింపు పలికే దిశగా చర్చలు సాగినట్లు సమాచారం. ఇటీవల ఢిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్, కర్ణాటక ఇన్‌చార్జ్ రణదీప్ సూర్జేవాలాతో సిద్ధరామయ్య, డీకే శివకుమార్ సమావేశమయ్యారు. ఈ భేటీలో కర్ణాటక రాజకీయ పరిస్థితులతో పాటు నాయకత్వ మార్పుపై కూడా చర్చ జరిగినట్లు ప్రచారం సాగుతోంది. అయితే కాంగ్రెస్ నాయకత్వం మాత్రం ఈ సమావేశంలో రాజ్యసభ, శాసన మండలి ఎన్నికల అంశాలపైనే చర్చ జరిగిందని చెబుతోంది. ముఖ్యమంత్రి పదవి నుంచి తప్పుకుని జాతీయ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించాలని అధిష్టానం సిద్ధరామయ్యను కోరినట్లు తెలుస్తోంది. రాబోయే లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఓబీసీ వర్గాల్లో కాంగ్రెస్ బలం పెంచే వ్యూహంలో భాగంగా సిద్ధరామయ్య సేవలను జాతీయ స్థాయిలో వినియోగించుకోవాలని పార్టీ భావిస్తున్నట్లు సమాచారం. రాజ్యసభ సభ్యత్వంతో పాటు పార్టీ సంస్థాగత వ్యవహారాల్లో కీలక బాధ్యతలు అప్పగించే అంశంపైనా హామీలు ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. కాంగ్రెస్‌లో బడుగు బలహీన వర్గాలకు ప్రాధాన్యం పెంచే దిశగా రాహుల్ గాంధీ వ్యూహాలు అమలు చేస్తున్న నేపథ్యంలో సిద్ధరామయ్యకు జాతీయ స్థాయిలో మరింత ప్రాధాన్యం దక్కే అవకాశాలు ఉన్నాయని పార్టీ వర్గాలు అంటున్నాయి. రాష్ట్ర రాజకీయాల కంటే దేశవ్యాప్తంగా ఓబీసీ సమీకరణలో ఆయన పాత్ర కీలకమవుతుందని అధిష్టానం భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే సీఎం మార్పుపై మీడియాలో వస్తున్న కథనాలను కాంగ్రెస్ అధికారికంగా ఖండిస్తోంది. అలాంటి చర్చ ఏదీ జరగలేదని కేసీ వేణుగోపాల్ స్పష్టం చేశారు. రాజ్యసభ, మండలి ఎన్నికలపైనే చర్చ జరిగిందని తెలిపారు. ఇదే సమయంలో సీఎం మార్పుపై ప్రశ్నించగా సిద్ధరామయ్య కూడా అవి కేవలం ఊహాగానాలేనని వ్యాఖ్యానించారు. కర్ణాటకలో 2023 అసెంబ్లీ ఎన్నికల తర్వాత సీఎం పదవిపై సిద్ధరామయ్య, డీకే శివకుమార్ మధ్య తీవ్ర పోటీ నెలకొన్న విషయం తెలిసిందే. చివరకు అధిష్టానం సిద్ధరామయ్యను ముఖ్యమంత్రిగా ఎంపిక చేయగా, శివకుమార్ ఉప ముఖ్యమంత్రి పదవితో సరిపెట్టుకున్నారు. రెండున్నరేళ్ల తర్వాత సీఎం బాధ్యతలు అప్పగిస్తామని అప్పట్లో అధిష్టానం హామీ ఇచ్చినట్లు శివకుమార్ వర్గం చెబుతూ వచ్చింది. ఇప్పుడు అదే ఫార్ములా అమలు చేసే దిశగా కాంగ్రెస్ అధిష్టానం అడుగులు వేస్తోందన్న ప్రచారం జరుగుతోంది. రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కర్ణాటకలో కొత్త నాయకత్వాన్ని ముందుకు తీసుకురావాలని పార్టీ భావిస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. సీఎం మార్పు జరిగితే డీకే శివకుమార్ పేరే దాదాపు ఖాయమని కర్ణాటక కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ఇదిలా ఉండగా, త్వరలో జరగనున్న రాజ్యసభ ఎన్నికల్లో సిద్ధరామయ్యకు అవకాశం కల్పించే అవకాశాలపైనా చర్చ సాగుతోంది. కర్ణాటకలో ఖాళీ కానున్న రాజ్యసభ స్థానాల్లో ఒకదానిని ఆయనకు కేటాయించే అవకాశముందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. దీంతో రాష్ట్ర రాజకీయాల నుంచి జాతీయ రాజకీయాల్లోకి సిద్ధరామయ్య అడుగుపెట్టే అవకాశాలపై ఊహాగానాలు మరింత బలపడుతున్నాయి.

# ఐపీఎల్-2026 ఫైనల్లోకి దూసుకెళ్లిన ఆర్సీబీ... గుజరాత్‌కు మరో చాన్స్

**క్వాలిఫయర్-1లో గుజరాత్‌పై ఆర్సీబీ 92 పరుగుల భారీ విజయం**

**ఐపీఎల్ 2026 ఫైనల్‌కు నేరుగా అర్హత సాధించిన బెంగళూరు**

**33 బంతుల్లో 93 పరుగులు చేసి కెప్టెన్ రజత్ పటీదార్ విధ్వంసం**



డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) ఐపీఎల్ 2026 సీజన్‌లో నేరుగా ఫైనల్లోకి దూసుకెళ్లింది. మంగళవారం జరిగిన క్వాలిఫయర్-1 మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్‌ను 92 పరుగుల భారీ తేడాతో చిత్తుగా ఓడించి టైటిల్ సమరానికి సిద్ధమైంది. కెప్టెన్ రజత్ పటీదార్ ఆడిన విధ్వంసకర ఇన్నింగ్స్ ఆర్సీబీ విజయంలో కీలకపాత్ర పోషించింది. మరోవైపు, ఈ మ్యాచ్‌లో ఓటమి పాలైనప్పటికీ గుజరాత్ టైటాన్స్‌కు ఫైనల్ చేరేందుకు మరో అవకాశం మిగిలి ఉంది. ఎలిమినేటర్ మ్యాచ్ విజేతతో ఆ జట్టు క్వాలిఫయర్-2లో తలపడనుంది. ధర్మశాల వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన గుజరాత్ టైటాన్స్ బౌలింగ్ ఎంచుకోగా, ఆర్సీబీ బ్యాటర్లు పరుగుల వరద పారించారు. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 254 పరుగుల భారీ స్కోరు సాధించారు. వెంకటేశ్ అయ్యర్ (19) మెరుపు ఆరంభాన్ని ఇవ్వగా, విరాట్ కోహ్లీ (43), దేవదత్ పడిక్కల్ (30) కీలక భాగస్వామ్యం నెలకొల్పారు. అయితే వీరిద్దరిని ఒకే ఓవర్లో పెవిలియన్ చేర్చి హోల్డర్ గుజరాత్‌కు కాస్త ఊరటనిచ్చాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన కెప్టెన్ రజత్ పాటిదార్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. కేవలం 33 బంతుల్లో 5 ఫోర్లు, 9 సిక్సర్లతో అజేయంగా 93 పరుగులు చేసి విధ్వంసం సృష్టించాడు. కృనాల్ పాండ్య (43) కూడా రాణించడంతో ఆర్సీబీ భారీ స్కోరు చేసింది. అనంతరం 255 పరుగుల కొండంత లక్ష్య ఛేదనలో గుజరాత్ టైటాన్స్ ఆరంభంలోనే తడబడింది. సాయి సుదర్శన్ (14), కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (2) త్వరగా ఔటయ్యారు. జోస్ బట్లర్ (29) వేగంగా ఆడే ప్రయత్నం చేసినా ఎక్కువసేపు నిలవలేదు. ఒక దశలో 51 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి గుజరాత్ పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆ సమయంలో రాహుల్ తెవాటియా (68) ఒంటరి పోరాటం చేశాడు. 43 బంతుల్లో 8 ఫోర్లు, 4 సిక్సర్లతో గుజరాత్ పరువు నిలిపే ప్రయత్నం చేశాడు. కానీ అతనికి ఇతర బ్యాటర్ల నుంచి సహకారం అందలేదు. ఆర్సీబీ బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు తీయడంతో గుజరాత్ 19.3 ఓవర్లలో 162 పరుగులకే ఆలౌట్ అయింది. ఆర్సీబీ బౌలర్లలో జాకబ్ డఫీ 3 వికెట్లు పడగొట్టగా.. భువనేశ్వర్ కుమార్, కృనాల్ పాండ్య, రసిఖ్ సలామ్ దార్ తలా రెండు వికెట్లు తీశారు. రేపు (మే 27) సన్ రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ జట్ల మధ్య ఎలిమినేటర్ మ్యాచ్ జరగనుంది. ఇందులో గెలిచిన జట్టుతో మే 29న క్వాలిఫయర్-2లో గుజరాత్ టైటాన్స్ తలపడనుంది. ఈ మ్యాచ్ లో గెలిచిన జట్టు ఫైనల్ చేరుతుంది.



## మంచిర్యాల జిల్లాలో రూ.2 కోట్ల బీమా డబ్బు కోసం భర్తను చంపించిన భార్య!

మంచిర్యాల జిల్లాలో జరిగిన ఓ రోడ్డు ప్రమాదం వెనుక దారుణమైన హత్య కోణం దాగి ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. సుమారు రూ.2 కోట్ల బీమా డబ్బు కోసం, వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని కట్టుకున్న భర్తనే ప్రియుడితో కలిసి ఓ భార్య సుపారీ ఇచ్చి చంపించినట్లు తేల్చారు. ఈ ఘటన మంచిర్యాల జిల్లాలో తీవ్ర కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. హాజీపూర్ మండలం గూడిపేట గ్రామానికి చెందిన శైని కుమార్ (45) మే 22వ తేదీన రోడ్డు ప్రమాదంలో మరణించినట్లు తొలుత కేసు నమోదైంది. అయితే, మృతుడి తల్లి లక్ష్మి తన కొడుకు మరణంపై అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేయడంతో పోలీసులు లోతుగా దర్యాప్తు చేపట్టారు. విచారణలో శైని కుమార్ భార్య భారతికి అదే గ్రామానికి చెందిన సురేందర్‌తో వివాహేతర సంబంధం ఉన్నట్లు, వారిద్దరూ కలిసి భర్తను అడ్డు తొలగించుకోవాలని పథకం వేసినట్లు తేలింది. ఈ కుట్రలో భాగంగా రామ్ మల్లేష్ అనే వ్యక్తికి రూ.10 లక్షల సుపారీ ఇచ్చి, అడ్వాన్సుగా రూ.2 లక్షలు చెల్లించారు. పథకం ప్రకారం, మే 22న శైని కుమార్‌కు నిందితులు ఫుల్లుగా మద్యం తాగించి, ఇనుప సుత్తితో తలపై మోది హత్య చేశారు. అనంతరం రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు మృతదేహాన్ని, బైక్‌ను రోడ్డుపై పడేసి పరారయ్యారు. ఈ కేసు వివరాలను మంచిర్యాల డీసీపీ భాస్కర్ మంగళవారం మీడియాకు వెల్లడించారు. హత్యకు పాల్పడిన భార్య భారతి, ఆమె ప్రియుడు సురేందర్, సుపారీ తీసుకున్న వారిలో ఒకడైన శ్రీరామ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. మరో ప్రధాన నిందితుడు రామ్ మల్లేష్ పరారీలో ఉన్నాడని, అతని కోసం గాలిస్తున్నామని చెప్పారు. నిందితుల నుంచి బీమా పత్రాలు, రూ.25 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.

## 4 రోజుల్లో ప్రభుత్వ భూమి ప్రైవేటు పేర్లకు మారింది : హరీశ్‌రావు

హరీశ్‌రావు.. పెద్దషాపూర్ భూములను గతంలోనే ప్రభుత్వ భూములుగా గుర్తించినట్లు తెలిపారు. ఆక్రమణలు జరగకుండా 22ఏ నిషేధిత జాబితాలో చేర్చాలని ఆర్డీఓ తహసీల్దార్‌కు ఆదేశాలు ఇచ్చారని చెప్పారు. ఇదే విషయాన్ని ఈ ఏడాది జనవరిలో హైకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో కూడా పేర్కొన్నారని వివరించారు. ఫిబ్రవరి 24న తహసీల్దార్ కూడా ఆ భూములు ప్రభుత్వానివేనని నిర్ధారించారని తెలిపారు. అయితే కేవలం నాలుగు రోజుల వ్యవధిలోనే ఫిబ్రవరి 28న ఆ భూములు ప్రైవేటు వ్యక్తులవిగా పేర్కొంటూ ఉత్తర్వులు జారీ చేశారని హరీశ్‌రావు ఆరోపించారు. అనంతరం భూ భారతి రికార్డుల్లో కూడా మార్పులు చేసి ప్రైవేటు పేర్లతో అప్‌లోడ్ చేశారని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ అనుమతి లేకుండా ఇలాంటి మార్పులు ఎలా జరిగాయని ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై మీడియాలో కథనాలు వచ్చిన తర్వాత ప్రభుత్వం కేవలం తహసీల్దార్‌ను బదిలీ చేసి బాధ్యత నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ఏసీబీ అధికారులు కార్యాలయానికి వెళ్లి తిరిగి రావడానికి కారణాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఈ భూ వ్యవహారంలో ప్రభావశీలుల పాత్ర ఉందని ఆరోపిస్తూ పూర్తి స్థాయి దర్యాప్తు జరపాలని కోరారు. తహసీల్దార్ జారీ చేసిన ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని, సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూముల రక్షణలో నిర్లక్ష్యం వహిస్తే భవిష్యత్తులో మరిన్ని అక్రమాలు జరిగే అవకాశం ఉందన్నారు. ఇదే సందర్భంగా జగిత్యాలలో ధాన్యం కొనుగోలు అంశంపై మాట్లాడిన ఆర్టీసీ డ్రైవర్‌ను సస్పెండ్ చేయడాన్ని కూడా ఆయన తప్పుబట్టారు. రైతుల సమస్యలపై ప్రశ్నించినందుకే చర్యలు తీసుకోవడం సరైంది కాదన్నారు. డ్రైవర్ అశోక్‌కు బీఆర్ఎస్ అండగా ఉంటుందని, అవసరమైతే న్యాయపోరాటం కూడా చేస్తామని ప్రకటించారు.

## పోక్సో కేసు: బండి భగీరథ్‌కు 3 రోజుల పోలీస్ కస్టడీ

హైదరాబాద్: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడు బండి భగీరథ్‌కు పోక్సో కేసుకు సంబంధించి మల్కాజ్‌గిరి కోర్టు మూడు రోజుల పోలీసు కస్టడీ విధించింది. ఈ మేరకు మంగళవారం ప్రాసిక్యూషన్ పిటిషన్‌పై న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది. విచారణ కోసం భగీరథ్‌ను వారం రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని పోలీసులు కోరగా, కోర్టు మూడు రోజులకు మాత్రమే అనుమతించింది. దీంతో ప్రస్తుతం చర్లపల్లి జైలులో ఉన్న భగీరథ్‌ను పేట్‌బషీరాబాద్ పోలీసులు కస్టడీలోకి తీసుకుని విచారించనున్నారు. అంతకుముందు, పోలీసు కస్టడీ పిటిషన్‌ను భగీరథ్ తరపు న్యాయవాది కరుణాసాగర్ వ్యతిరేకించారు. ఒకవేళ కస్టడీకి అనుమతిస్తే ఉదయం 10 నుంచి సాయంత్రం 5:30 గంటల మధ్య మాత్రమే విచారణ జరపాలని, విచారణకు ముందు, తర్వాత వైద్య పరీక్షలు నిర్వహించాలని కోరారు. విచారణ సమయంలో బలవంతపు పద్ధతులు వాడకుండా పోలీసులను ఆదేశించాలని కూడా ఆయన విజ్ఞప్తి చేశారు. మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడన్న ఆరోపణలపై మే 8న భగీరథ్‌పై పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. బాధితురాలి వాంగ్మూలం తర్వాత పోలీసులు కేసులో కఠినమైన సెక్షన్లను జోడించారు. మే 16న హైకోర్టులో మధ్యంతర రక్షణ లభించకపోవడంతో పోలీసులు భగీరథ్‌ను అరెస్ట్ చేశారు. అయితే, తన కుమారుడు పోలీసుల ఎదుట లొంగిపోయాడని బండి సంజయ్ తెలిపారు. నేరం అంగీకరించిన తర్వాతే అరెస్ట్ చేశామని పోలీసులు పేర్కొన్నారు. అనంతరం కోర్టు అతనికి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది.

## 45 ఏళ్ల తర్వాత పోలీసుల ఎదుట మావోయిస్ట్ నరహరి లొంగుబాటు..

మావోయిస్టులను పూర్తిగా నిర్మూలించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 'ఆపరేషన్ కగార్' చేపట్టిందని.. ఛత్తీస్‌గఢ్ వంటి ప్రాంతాలలో భద్రతా దళాలు నిరంతరం జరిపిన కూంబింగ్ ఆపరేషన్ల వల్లే ఈ స్థాయిలో లొంగుబాట్లు, మార్పులు సాధ్యమయ్యాయని డీజీపీ సీవీ ఆనంద్ పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఇంకా 47 మంది మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యులు అజ్ఞాతంలో ఉన్నారని డీజీపీ తెలిపారు. ఇందులో ఛత్తీస్‌గఢ్ నుంచి 15 మంది, ఒడిశా నుంచి 15 మంది, ఝార్ఖండ్ నుంచి 13 మంది ఉండగా.. తెలంగాణకు చెందిన వారు ముగ్గురు, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు ఒక్కరు ఉన్నట్లు గుర్తించామన్నారు. ముఖ్యంగా తెలంగాణకు చెందిన కేంద్ర కమిటీ సభ్యులు ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి, జాడే రత్నబాయి అలియాస్ సుజాత, వార్త శేఖర్ అలియాస్ మంగులు తక్షణమే లొంగిపోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. లొంగిపోయిన వారికి ప్రభుత్వం తరపున పూర్తి పునరావాస సదుపాయాలు, అన్ని రకాల బెనిఫిట్స్ కల్పిస్తామని భరోసా ఇచ్చారు.

### తెలంగాణ గవర్నర్‌ను కలిసిన కవిత... రేవంత్ సర్కారుపై ఫిర్యాదు

అంగీకరించిందని, పరిగి, ఆర్‌ఆర్‌ఆర్ భూసేకరణ ప్రక్రియలను నిలిపివేసిందని కవిత తెలిపారు. ఇవి పాక్షిక విజయాలని, సంపూర్ణ న్యాయం కోసం కేంద్రం ప్రమేయం అవసరమని, అందుకే గవర్నర్‌ను కలిశామన్నారు. గవర్నర్ సానుకూలంగా స్పందించారని, అన్ని అంశాలపై నివేదిక తెప్పించుకుని న్యాయం చేస్తారని ఆశిస్తున్నట్లు చెప్పారు. బాధితులకు న్యాయం జరగని పక్షంలో మరోసారి ఉద్యమబాట పడతామని ఆమె హెచ్చరించారు.

# జూన్ 3 న కోహెడ ప్రాంతంలో పండ్ల మార్కెట్ శంకుస్థాపన కార్యక్రమం లో వేలాది మంది రైతులతో భారీ బహిరంగ సభ

**హాజరు కానున్న సీఎం ఎనుముల రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, రాష్ట్ర మంత్రులు**

**కోహెడ లో చేపట్టే నూతన మార్కెట్ పనులను మంగళవారం పరిశీలించిన ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి జిల్లా కలెక్టర్, నారాయణ రెడ్డి, మల్కాజిగిరి సిపి సుమతి, గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి**

ఎల్బీనగర్ 26 మే:ఎన్నో రోజులుగా ఎదురు చూస్తున్న పండ్ల మార్కెట్ నిర్మాణానికి రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం ముందడుగు వేసింది. ఇక పండ్ల రైతులకు,వ్యాపారులకు కష్టాలు తీరినట్లే,కోహెడ ప్రాంతంలో సర్వే నంబర్ 167/1 లో దాదాపు 179 ఎకరాలలో చేపట్టనున్న నూతన పండ్ల మార్కెట్ కి జూన్ 3 న అధికారికంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు లు శంకుస్థాపన చేయనున్నారు. ఇట్టి కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యే లు, సమ్మిళిత సంబంధిత ఉన్నత స్థాయి అధికారులు పాల్గొంటున్నారని పెద్దనారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి వెల్లడించారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి పర్యవేక్షణలో మార్కెట్ శంకుస్థాపన పనులను రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, మల్కాజ్గిరి పోలీస్ కమిషనర్ సుమతి లతో పాటు సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. మార్కెట్ అభివృద్ధి పనులతో పాటు పరిసర ప్రాంతాలను పరిశీలించి అధికారులతో చర్చించి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే సూచించారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆర్డిఓ



అనంత రెడ్డి, డీసీపీ అనురాధ, ట్రాఫిక్ డిసిపి శ్రీనివాసులు, ఇంటెలిజెన్స్ డిసిపి నరసింహ రెడ్డి, ఏసిపి కాశిరెడ్డి, ఇన్స్పెక్టర్ అశోక్ రెడ్డి, ఎమ్మార్వో సుదర్శన్ రెడ్డి, మార్కెటింగ్ ఎస్సీ లక్ష్మణ్, డి ఇ రవీంధర్, డిడి ప్రసాద్ రావు, జెడి మల్లేశం, మార్కెట్ సెక్రటరీ శ్రీనివాస్ తో పాటు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాస్కర చారి, సభ్యులు జైపాల్ రెడ్డి, మధుసూదన్ రావు, అంజయ్య, రఘుపతి రెడ్డి, మచ్చెందర్ రెడ్డి, నవరాజ్ ఇబ్రహీం పాల్గొన్నారు.

# రాములు కృషి -- ఎమ్మెల్యే స్పందన.. జిల్లెల్లకు విద్యుత్ వరం

కల్వకుర్తి మే 26 వార్త మిర్రర్ ప్రతినిధి:- కల్వకుర్తి మండలంలోని జిల్లెల్ల గ్రామంలో ఎన్నో సంవత్సరాలుగా నెలకొన్న విద్యుత్ సమస్యలకు ఎట్టకేలకు శాశ్వత పరిష్కారం లభించింది. చిన్నపాటి గాలి, వర్షం వచ్చినా విద్యుత్ సరఫరా నిలిచిపోవడం, తక్కువ వోల్టేజ్ సమస్యలతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ వచ్చారు. జిల్లెల్ల గ్రామంతో పాటు సమీప గ్రామాలకు ఒకే లైన్ ద్వారా విద్యుత్ సరఫరా జరగడం వల్ల తరచూ అంతరాయాలు ఏర్పడేవి. ఈ సమస్యలను మాజీ సర్పంచ్, ప్రస్తుత ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ కమిటీ సభ్యుడు జిల్లెల్ల రాములు స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి గ్రామానికి ప్రత్యేకంగా విద్యుత్ సదుపాయాలను కల్పించేందుకు చర్యలు చేపట్టారు. దీంతో గ్రామంలో 24 గంటల నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందేలా నూతన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు.విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లెల్ల రాములు హాజరై గ్రామ సర్పంచ్ కొమ్మగోని రాజేశ్వరి రవి గౌడ్ కలిసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి, గ్రామానికి కల్పించిన విద్యుత్ సదుపాయాల పై కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఎముక రవి, పంచాయతీ కార్యదర్శి తిరుపతి గౌడ్, వార్డు సభ్యులు తాడెం మౌనిక మల్లయ్య, గుమ్మకొండ నాగమణి మహేందర్, డొక్కు చెన్నమ్మ జంగయ్య, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు ముచ్చర్ల శ్రీకాంత్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ వీరెడ్డి శ్రీనివాస్



రెడ్డి, హనుమాన్ దేవాలయ వైస్ చైర్మన్ వీరెడ్డి శ్యాంసుందర్ రెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యుడు గుమ్మకొండ బాల్ జంగయ్య, కురుమ సంఘం అధ్యక్షుడు చిక్కొండ బీరయ్య, నాయకులు వీరెడ్డి కృష్ణారెడ్డి, మొక్తాల బాల్ జంగయ్య, చిక్కొండ మల్లయ్య, కొమ్మగోని సత్యనారాయణ గౌడ్, కొమ్మగోని జంగయ్య గౌడ్, చిక్కొండ వెంకటయ్యతో పాటు పలువురు నాయకులు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# బాధితురాలికి అండగా దళిత సంఘాలు

కల్వకుర్తి, మే 26 వార్త మిర్రర్ ప్రతినిధి: నాగర్‌కర్నూల్ జిల్లా తోటపల్లి గ్రామానికి చెందిన ఓ దళిత మహిళకు జరిగిన అన్యాయంపై సమగ్ర దర్యాప్తు జరిపి బాధితురాలికి న్యాయం చేయాలని ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి (రాజకూరా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పుల నర్సింహా డిమాండ్ చేశారు. మంగళవారం ఎస్సీ ఆర్ పి ఎస్ నాయకులతో కలిసి బాధిత మహిళ నివాసానికి వెళ్లి ఆమెను పరామర్శించారు.ఈ సందర్భంగా బాధిత మహిళ తనకు ఎదురైన పరిస్థితులను నాయకులకు వివరించినట్లు తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం, ప్రేమ పేరుతో మోసపోయి వేధింపులకు గురైనట్లు పేర్కొన్నారని అన్నారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పూర్తి స్థాయిలో దర్యాప్తు నిర్వహించి, చట్టప్రకారం నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉప్పుల నర్సింహా పోలీసు అధికారులను కోరారు.బాధితురాలు తన ఫిర్యాదును పూర్తిగా నమోదు చేయకుండా కేసును బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిపారు. బాధితురాలి వాంగ్మూలం ఆధారంగా కేసును విచారించి, ఆమెకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే బాధిత కుటుంబంపై రాజీ ఒత్తిళ్లు వస్తున్నాయని బాధితురాలు పేర్కొన్నట్లు వెల్లడించారు.ప్రస్తుతం బాధిత మహిళ మరియు ఆమె కుటుంబ సభ్యులు భయాందోళనల మధ్య జీవిస్తున్నారని, వారికి తక్షణమే పోలీసు రక్షణ కల్పించాలని ఆయన కోరారు. దళిత సంఘాలు, ప్రజాప్రతినిధులు ముందుకు వచ్చి బాధిత కుటుంబాన్ని పరామర్శించి మనోధైర్యం



కల్పించాలని విజ్ఞప్తి చేశారు. బాధితురాలికి న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కల్వకుర్తి ఇన్‌చార్జి బోయినపల్లి కృష్ణ, రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి కాకి వినోద్, జిల్లా నాయకులు దుబ్బ మహేష్, అంతటి పర్వతాలు తదితరులు పాల్గొన్నారు

# ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ఆర్టీసీ డ్రైవర్ అశోక్‌పై వేటు వేయడం సరికాదు...

**డ్రైవర్ అశోక్ కుటుంబానికి బీజేపీ అండగా ఉంటుంది**

**డ్రైవర్ అశోక్ తో ఫోన్లో మాట్లాడిన నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్**

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి మే 26

ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకే ఆర్టీసీ డ్రైవర్ అశోక్‌పై వేటు వేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని జగిత్యాల నియోజకవర్గ బీజేపీ ఇంచార్జీ డాక్టర్ భోగ శ్రావణి అన్నారు. మంగళవారం డ్రైవర్ అశోక్ ను పరామర్శించి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించడం లేదని ప్రతి సామాన్య ప్రజలు ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు ఉంటుందని, ఇలా ప్రశ్నించిన ప్రతి వారిని ఇబ్బందులకు గురి చేయడం సరికాదని పేర్కొన్నారు. వెంటనే డ్రైవర్ అశోక్ ను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అయితే విషయం తెలుసుకున్న నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ స్థానిక నాయకుల సహకారంతో డ్రైవర్ అశోక్ తో సెల్ ఫోన్ ద్వారా మాట్లాడారు. పరిస్థితిపై పరిశీలన జరిపారు. పార్టీ తరపున, వ్యక్తిగతంగా అన్ని విధాలుగా అండగా ఉంటామని పేర్కొన్నారు. తెలంగాణలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని, తమ ప్రభుత్వం ఏర్పాటు జరిగిన వెంటనే డ్రైవర్ అశోక్ ఉద్యోగాన్ని రెగ్యులరైజ్ చేస్తామని పేర్కొన్నారు. ధైర్యంగా ఉండాలని, తాము అండగా



ఉంటామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల్ మున్సిపల్ బిజెపి ఫ్లోర్ లీడర్ వేముల శ్రీనివాస్, సుంచు సురేష్, శ్రీపతి రమేష్, పవన్ సింగ్, ఇట్యాల రాము, సిరిపురం శ్రీనివాస్ గట్టుపల్లి జ్ఞానేశ్వర్, కాసెట్టి తిరుపతి,శివ, ప్రకాష్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# కంభం నివాసి సుఖేష్ జన్మదినం... బస్తి నిరుపేదలకు అల్పాహారం.!

**కృష్ణ గోపాల్ సేవాసమితి ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ**



వార్త మిర్రర్ తెలంగాణ స్టేట్ బ్యూరో

ఖమ్మం నివాసి సుకేష్ గారి జన్మదిన సందర్భంగా వనస్థలిపురంలో కృష్ణ గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో పేదల బస్తీలో ఉదయం అల్పాహార కార్యక్రమం నిర్వహించబడింది.ఈ




సేవా కార్యక్రమంలో అధ్యక్షులు కపిల్ కుమార్ అగర్వాల్, ఖజాంచీ కుష్ అగర్వాల్, జాయింట్ సెక్రటరీ మనోజ్ గుప్తా, ఎగ్జిక్యూటివ్ సభ్యులు సతీష్ యాదవ్, సునీల్ దరాడే మరియు సురేష్ ధావ్లే పాల్గొని సుకేష్ గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కృష్ణ గోపాల్ సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షులు కపిల్ కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ భగవంతుడు వారికి ఆయురారోగ్యాలు, ఆనందం మరియు మరెన్నో సేవా అవకాశాలు ప్రసాదించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని తెలిపారు



# దళిత క్రైస్తవ హక్కుల నూతన సాధన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక.

కల్వకుర్తి మే 26 వార్త మిర్రర్ ప్రతినిధి:-నాగర్ కర్నూల్ జిల్లా తాడురు మండలములోని యేసు ప్రార్థన మందిరం లో మంగళవారం నాడు నాలుగు నియోయాక వర్గాల నుండి వచ్చిన సేవకులు సంఘ పెద్దలు కలసి దళిత క్రైస్తవ హక్కుల సాధన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అధ్యక్షులుగా,బెజవాడ రవి కుమార్,ఉపాధ్యక్షులుగా, సంపత్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా పీఎం.జాన్ రామస్వామి, సంయుక్త కార్యదర్శిగా: ఎన్.పీ. సామేల్, కోశాధికారిగా,ఎ,జాన్ బుచ్చయ్య,కార్యవర్గ సభ్యులుగా యస్ మోషే, కె.సత్యం, యం.ఎజ్రా, సి హెచ్ కృష్ణయ్య.సలహాదారులుగా,పి. నతానియెల్, ఆర్.వెంకటయ్య లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో జిల్లాలోని నియోజక వర్గ మరియు మండలాల నుండి సేవకులు అబ్రహం, బర్నబాస్, క్రిష్టాఫర్, సైమన్, సొలమన్, బోయాజు, గోవర్ధన్, మిఖాయిల్, గుమ్మకొండా రాజు, అరుణ్ కుమార్, యోహాను పిటర్ నాగయ్య, లాజర్, ఇంకా అనుకులు పాల్గొన్నారు.దళిత క్రైస్తవ హక్కుల సాధన కోసం దళిత క్రైస్తవులకు ఎస్సీ స్టేటస్ కోసం ఏకముగా కలసి పోరాడి సాధించుకునే వరకు ఉద్యమిస్తామని నూతనముగా ఎన్నికైన కమిటీ ఈ సమావేశంలో భరోసా కల్పించారు.



# బాల్య వివాహాల నిషేధశీ పై అవగాహన

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి మే 26

ప్రజా పాలనా ప్రగతి ప్రణాళిక లో భాగంగా మంగళవారం రోజున మహిళా వారోత్సవాల సందర్భంగా జగిత్యాల జిల్లా రాయికల్ మండలం కట్కాపూర్ అంగన్వాడీ వాడి కేంద్రం లో బాల్య వివాహాల నిషేధశీ పై అవగాహన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి సర్పంచ్ పడాల పూర్ణిమ తిరుపతి, సెక్రటరీ రాజశ్రీ, పడిగేల లక్ష్మన్, అంగన్వాడీ టీచర్స్ నాగరత్న, రాధ, సంధ్య, ఆశ కార్యకర్త చుక్క గంగవ్వ, మహిళ సంఘ సభ్యులు సుజాత, భాగ్యలక్ష్మి, సారిక గ్రామ పంచాయతీ సభ్యులు పాల్గొన్నారు.



# సొంత డబ్బులతో ప్రమాద భీమా చేయించిన సర్పంచ్

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి మే 26

జగిత్యాల జిల్లా మైతాపూర్ గ్రామంలో గ్రామ సర్పంచ్ తలారి నాగమణి పంచాయతీ కార్మికుల సంక్షేమం కొరకు సొంత డబ్బుల తో 8 మంది గ్రామ పంచాయతీ కార్మికులకు తలా 5 లక్షల రూపాయల ప్రమాద భీమా పాలసీ చేయించి సబ్బులు, సర్పు, కొబ్బరి నూనె వంటి వస్తువులతో పాటు ప్రమాద భీమా పాలసీ బాండ్ లను మంగళవారం రోజు రాయికల్ ఎంపీడీఓ చిరంజీవి చేతుల మీదుగా అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తలారి నాగమణి రాజేష్, వార్డ్ సభ్యులు బొమ్మెన లక్ష్మి-బాబు, బూస గంగమల్లయ్య, కొల్ల ప్రమీల నారాయణ, లింగంపల్లి లక్ష్మణ్, నేమిల్ల లత స్వామి రెడ్డి, పంచాయతీ కార్యదర్శి వేణు తదితరులు పాల్గొన్నారు.

# పోషకాహార పదార్థాలు, చిరుధాన్యాల పై అవగాహనా

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి మే 2699 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా మహిళా వారోత్సవాల సందర్భంగా మంగళవారం రోజున జగిత్యాల జిల్లా రాయికల్ మండలం వడ్డలింగాపూర్ గ్రామంలోని అంగన్వాడి కేంద్రం 2, 3 లో బాల్య వివాహాల నిషేధ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.. ఈ సందర్భంగా పోషకాహార పదార్థాలు, చిరుధాన్యాలు ఆరోగ్యంగా ఉండటానికి కావలసిన వాటి గురించి అవగాహన కల్పించారు.. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు పాలకుర్తి గంగాజల, రమాదేవి, గ్రామ సభ్యులు పాల్గొన్నారు.





# వైభవంగా బోనాల పండుగ

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి మే 26జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలో మంగళవారం ఎల్లమ్మ పట్నాల సందర్భంగా బోనాల పండుగను గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఇంటికో బోనంతో మహిళలు తరలి వచ్చి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం ఓడి బియ్యం పోసి మొక్కులు చెల్లించారు. పోతూ రాజులు, బైండ్ల పూజారుల విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షులు ఏనుగందుల శ్రీనివాస్ గౌడ్, కోశాధికారి బండి ప్రవీణ్, ఉపాధ్యక్షుడు పొన్నం శ్రీకాంత్, కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

# తెలంగాణ రియాల్టర్స్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా మారగోని యాదయ్య ఎన్నిక

### రియల్ ఎస్టేట్ ఏజెంట్లకు అండగా ఉంటా- మారగోని యాదయ్య



వార్త మిర్రర్ తెలంగాణ స్టేట్ బ్యూరో

రియల్ ఎస్టేట్ ఏజెంట్లకు అండగా ఉంటారని నూతనంగా ఎన్నికైన తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మారగోని యాదయ్య అన్నారు.ఏజెంట్ల సహాయ సహకారం లేకుండా రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధి సాధించలేదని కస్టమర్లు ప్లాట్లు కొనే దగ్గర నుండి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యే వరకు సేవలు అందించడంలో ఏజెంట్లు ముందుంటారని అన్నారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రియల్ ఎస్టేట్ రంగాన్ని కుదేలు చేస్తున్నాయని కానీ ఈ రంగం నుండే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు 22 శాతం ఆదాయం వస్తుందని ఆయన తెలిపారు. రంగారెడ్డి జిల్లాలో రియల్ ఎస్టేట్ రంగాన్ని బలోపేతం చేస్తానని రియల్ ఎస్టేట్ లు సభ్యత్వం తీసుకొని రియల్ ఎస్టేట్ అసోసియేషన్ ని బలోపుతం చేయాలని అన్నారు. రియల్ ఎస్టేట్ ఏజెంట్లు ఎక్కడ ఇబ్బందులు గురి కావద్దని రియల్ ఎస్టేట్ వ్యాపారంలో కమిషన్ ఎగ్గొట్టిన వారి భరతం పడతామని రియల్ ఎస్టేట్ ఏజెంట్లకు సమాన న్యాయం జరిగే విధంగా తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ ముందు వరుసలో ఉంటుందని తెలియజేశారు. జిల్లాలో రియల్టర్లకు ఎలాంటి కష్టాలు, బాధలు వచ్చినా వారికి కమిషన్ విషయంలో అన్యాయం జరిగిన డబల్ రిజిస్ట్రేషన్ చేసిన పూర్తిగా రియల్టర్లకు అండగా ఉంటానని యాదగిరి అన్నారు. నాకు ఈ పదవి బాధ్యతలు అప్పగించిన తెలంగాణ రియాల్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు బొంగు వెంకటేష్ గౌడ్ గారికి ధన్యవాదాలు చెప్పారు



## పహాడీ షరీఫ్ 64 డివిజన్‌లో హెల్త్ కార్డ్, ఆరోగ్యశ్రీ కార్డ్‌ల పంపిణీ

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి :మే 26 :- ప్రజలందరికీ మెరుగైన ఉచిత వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం పహాడీ షరీఫ్ 64 డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు షేక్ యూసుఫ్ ఖాద్రీ ఆధ్వర్యంలో హెల్త్ కార్డ్ మరియు ఆరోగ్యశ్రీ కార్డ్‌ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు టిపిసిసి మెంబర్ దేప భాస్కర్ రెడ్డి గారు పాల్గొని లబ్ధిదారులకు కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. పేద, మధ్యతరగతి ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం భారంగా మారకూడదనే ఉద్దేశంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ, హెల్త్ కార్డుల ద్వారా ఉచిత వైద్య సేవలను మరింత బలోపేతం చేస్తోందని అన్నార అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అఫ్జల్,భూపాల్ రెడ్డి, ఫాజిల్ ఖాద్రీ, భాను,వసీం, రజనీకాంత్ గౌడ్,నిసార్ హసన్ ఒమర్,హబీబ్‌లి మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు....

## అల్లీపూర్ లో ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి మే 26

జగిత్యాల జిల్లా రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రధాన మూల మలుపు వద్దే ఉన్న ఈ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చిమొక్కలు, తీగలు దట్టంగా అల్లుకుపోయాయి. వైర్లు సైతం ప్రమాదకరంగా కిందకు వేలాడుతున్నాయి. నిత్యం వాహనదారులు, ప్రజలు రాకపోకలు సాగించే ఈ మలుపు వద్ద కనీస రక్షణ కంచె (ఫెన్సింగ్) సరిగ్గా లేకపోవడంతో నిత్యం భయాందోళనలు వ్యక్త మవుతు న్నాయి. రాత్రి వేళల్లో మలుపు తిరిగే వాహనదారులకు ఈ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్ సరిగ్గా కనిపించక ఢీకొట్టే ముప్పు పొంచి ఉంది. పశు వులు, చిన్నపిల్లలు అటువైపు వెళ్తుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి, తక్షణమే చుట్టూ ఉన్న పిచ్చిమొక్కలను తొలగించి, ట్రాన్ఫార్మర్ ను సురక్షిత ప్రాంతానికి మార్చాలని లేదా రక్షణ చర్యలు చేపట్టాలని ఇందిరమ్మ కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు...




## తెలంగాణ రాష్ట్ర బీజేవైఎం కార్యవర్గ సభ్యులు గా భార్గవ్ తేజ

### భార్గవ్ తేజను ఘనంగా సన్మానించిన మాజీ కార్పొరేటర్ లచ్చిరెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు చంద్ర యాదవ్

ఎల్బీనగర్, 26 మే : తెలంగాణ రాష్ట్ర బీజేవైఎం కార్యవర్గ సభ్యులుగా వనస్థలిపురం డివిజన్ కు చెందిన భార్గవ్ తేజ నూతనంగా నియమితులయ్యారు. నియామక పత్రాన్ని రాష్ట్ర బీజేవైఎం అధ్యక్షుల చేతుల మీదుగా భార్గవ్ తేజ అందుకున్నారు. నూతనంగా ఎన్నికైన సందర్భంగా మంగళవారం బి ఎన్ రెడ్డి నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ లచ్చి రెడ్డి, బీజేపీ నాయకులు భార్గవ్ తేజ ని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు . ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు చంద్ర యాదవ్, సుధీర్, శబరి, కౌశిక్ మహర్షి, రాజేష్, అభిషేక్, పండు, అభి తదితరులు పాల్గొన్నారు.

# ఐఐఐటీ జంక్షన్ వద్ద రోడ్డు అభివృద్ధి పనులను పరిశీలించిన సైబరాబాద్ సీపీ.....

సైబరాబాద్ వార్త మిర్రర్ :

సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్, ఐపీఎస్ మంగళవారం గచ్చిబౌలి ఐఐఐటీ జంక్షన్ వద్ద కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఐటీ కారిడార్ ప్రాంతంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు నిర్మిస్తున్న మల్టీ లెవల్ ఫ్లైఓవర్లు, అండర్‌పాస్ పనుల పురోగతిని ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా సిఎంసి ఇంజినీరింగ్ విభాగం అధికారులు, సైబరాబాద్ ట్రాఫిక్ విభాగ అధికారులు నిర్మాణ పనులు జరుగుతున్న తీరును సీపీ కు వివరించారు. జంక్షన్ పరిసర ప్రాంతాల్లో ప్రస్తుత ట్రాఫిక్ పరిస్థితులను పరిశీలించిన సీపీ, నిర్మాణ కాలంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగిన ట్రాఫిక్ మళ్లింపులు అమలు చేయాలని సూచించారు. ప్రత్యామ్నాయ రహదారుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, వాహనాల రాకపోకలు సాఫీగా సాగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.అలాగే ముఖ్య ప్రాంతాల్లో సరైన సూచిక బోర్డులు, బ్యారికేడ్లు, లైటింగ్ ఏర్పాటు చేయడంతో పాటు ట్రాఫిక్ సిబ్బందిని అవసరమైన ప్రాంతాలులో నియమించాలని సూచించారు. ప్రాజెక్టు పనులు నిర్ణీత గడువులో పూర్తి అయ్యేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సీపీ పేర్కొన్నారు.ఈ



సందర్శనలో సైబరాబాద్ ట్రాఫిక్ డీసీపీ శేషాద్రిని రెడ్డి, ట్రాఫిక్ ఏడీసీపీ హనుమంతరావు, సిఎంసి ఇంజినీరింగ్ విభాగ అధికారులు, ఇతర పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సామాజిక న్యాయం కోసం ఆమె చేసిన పోరాటం చిరస్మరణీయశీ..

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి మే 26

చౌటుప్పల్ మండల కేంద్రంలో తెలంగాణ సామాజిక ఉద్యమకారిణి, ప్రత్యేక తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి ప్రదాత అమరురాలు బెల్లి లలిత వర్ధంతి కార్యక్రమాన్ని యాదవ సంఘం నాయకులు, సామాజిక కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యాదవ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ డా.చిలకల శ్రీనివాస్ యాదవ్, మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో చేసిన త్యాగాలు, సామాజిక సేవలను స్మరించుకున్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం బడుగు బలహీన వర్గాల గొంతుకగా నిలిచి పోరాడిన బెల్లి లలిత అక్కను ఆ నాటి పెత్తందారీ వర్గాలు కుట్రపూరితంగా హత్య చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు.తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో తిరుగుతూ పాటల రూపంలో ప్రజల్లో చైతన్యం నింపిన బెల్లి లలిత అక్క ఉద్యమ స్ఫూర్తి నేటి తరాలకు ఆదర్శమని పేర్కొన్నారు. ఆమె పాటలు, ప్రసంగాలు తెలంగాణ ప్రజల్లో స్వీయ గౌరవాన్ని పెంపొందించాయని తెలిపారు. ముఖ్యంగా బడుగు బలహీన వర్గాల సమస్యలను ప్రజల ముందుకు తీసుకువచ్చి సామాజిక న్యాయం కోసం ఆమె చేసిన పోరాటం చిరస్మరణీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం మండల అధ్యక్షుడు చినుకాని మల్లేష్ యాదవ్,అధ్యక్షులు పరవతాలు యాదవ్, డాక్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు శివకుమార్ యాదవ్, నాయకుడు రొండే నరసింహ యాదవ్, సర్పంచ్ స్వామి యాదవ్, గజ్జి పాండ యాదవ్, సాయి కుమార్ యాదవ్ తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# ప్రైవేట్ పాఠశాలలలో స్టేషనరీ వ్యాపారాన్ని అరికట్టాలి

### జిల్లా విద్యాధికారి కనుసైగల్లో పర్మిషన్ లేని పాఠశాలలు ఎన్నో

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి మే 26

ఎస్ఎఫ్ఐ చౌటుప్పల్ మండల అధ్యక్ష కార్యదర్శులు దాసరి ప్రకాష్ తిగుళ్ళ శ్రీనివాస్ భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ మేరకు ఎస్ఎఫ్ఐ చౌటుప్పల్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఇన్చార్జ్ ఎంఈఓ కి వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష కార్యదర్శులు దాసరి ప్రకాష్ తిగుళ్ళ శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రైవేటు మరియు కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యార్థుల నుండి అధిక ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులపై తీవ్ర ఆర్థిక భారం మోపుతున్నాయి.పాఠశాలలు ఇంటర్నేషనల్ సీబీఎస్సీ ఐసీఎస్సీ రకాల పేర్లతో అదనపు ఫీజులు వసూలు చేయడం వల్ల మధ్యతరగతి మరియు పేద కుటుంబాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని, ప్రైవేటు విద్యాసంస్థల ఫీజులను నియంత్రించే ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని, ప్రతి విద్యాసంస్థ ఫీజు వివరాలను పారదర్శకంగా ప్రకటించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. అదేవిధంగా ప్రైవేట్ పాఠశాలల్లో స్టేషనరీ వ్యాపారాన్ని అరికట్టాలని జిల్లా విద్యాధికారి కొనసాగిగారిలో పర్మిషన్ లేని పాఠశాలలపై ఎటువంటి చర్యలు తీసుకోకుండా పుట్టగొడుగుల పుట్టుకొస్తున్న ప్రైవేట్ పాఠశాలలకు ప్రభుత్వం అండగా




నిలిచేందుకు వివరిస్తున్న తీరు సరికాదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షురాలు పల్సం సృజన,మణికంఠ ,శీను, తదితరులు పాల్గొన్నారు..

## మనం ఒక్క మొక్కను నాటుదాం...

## భావి తరాలకు స్వచ్ఛమైన భూమిని కానుకగా ఇద్దాం.!

### మొక్కలు నాటి కాలుష్యాన్ని తగ్గించి స్వచ్ఛమైన ప్రాణవాయువును అందిద్దాం.- గొల్లూరి రాములు సగర



వార్త మిర్రర్ తెలంగాణ స్టేట్ బ్యూరో

నేటి జనం ఎండల తాకిడికి తట్టుకోలేకపోతున్నారు. యువకుల నుంచి 40 సంవత్సరాల వయసు నుంచి 70 సంవత్సరాల వయసు వరకు ఎండల తాకిడికి తట్టుకోలేక అల్లాడుతున్నారు అనేది నిజం.! ఈ ఇబ్బందులను తొలగించడానికి మనము ముందుకొచ్చి చిన్న కృషి చేయాలి అన్నారు. రిటైర్డ్ ప్రభుత్వ ఎంప్లాయ్, తెలంగాణ రాష్ట్ర సగర సంఘం నాయకులు గొల్లూరి రాములు సగర. వారు ఈ సందర్భంగా మాట్లాడుతూ నేడు ఎండలు 40 నుంచి 49 వరకు ఉష్ణోగ్రతతో తట్టుకోలేకపోతున్నాము భవిష్యత్తులో 55 నుంచి 60 వరకు ఉష్ణోగ్రత రావడంలో ఎక్కువ సమయం పట్టదు అన్నారు. వారు ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోయే తరానికి ఉష్ణోగ్రత నియంత్రణ జరగాలంటే ప్రతి ఒక్కరూ పుట్టినరోజు వేడుకల్లో కానీ వివాహ మహోత్సవ వేడుకల్లో కానీ ప్రతి వేడుక సందర్భాన్ని ప్రతి ఒక్కరూ ఒక్క మొక్క నాటడం నేర్చుకోవాలని తెలిపారు. మొక్కలు నాటడం ద్వారా కాలుష్యాన్ని తగ్గించి స్వచ్ఛమైన ప్రాణవాయువును అందించవచ్చు అని అన్నారు. పచ్చదనంపై పెంపొందించడం ద్వారా వర్షాలు సమృద్ధిగా పడతాయని, నేల కోత ఆగుతుందని మరియు పర్యావరణ సమతుల్యత కాపాడుతుందని, మొక్కల పెంపకం వల్ల కలిగే ముఖ్యమైన ప్రయోజనాలు "ఆక్సిజన్" ఉత్పత్తి చెట్లు కార్బన్ ఆక్సిడ్ ను పీల్చుకొని ప్రాణవాయువును ప్రజలకు అందిస్తుందని తెలిపారు" ప్రతి ఒక్కరూ ఒక్క మొక్కను నాటుదాం... భావితరాలకు స్వచ్ఛమైన భూమిని కానుకగా ఇద్దాం." అనే నినాదాన్ని ముందుకు తీసుకెళ్దాం అని తెలిపారు

## పెట్రోల్ ధరల పెంపుపై బీఆర్ఎస్ ధర్నా

### మాదాపూర్‌లో నాయకుల అరెస్ట్



శేరిలింగంపల్లి, మే 26 (వార్త మిర్రర్):

ప్రజలపై పెట్రోల్ భారాన్ని మోపుతున్న ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా తమ పోరాటం కొనసాగుతుందని బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు. పెట్రోల్ ధరల పెంపును నిరసిస్తూ మాదాపూర్ హైటెక్ సిటీ సర్కిల్‌లో బీఆర్ఎస్ మాజీ స్టేట్ యూత్ ప్రధాన కార్యదర్శి రాయల కార్తీక్ (ఆర్కే) ఆధ్వర్యంలో మంగళవారం బీఆర్ఎస్ శ్రేణులు భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నిరసన చేపడుతున్న రాయల కార్తీక్‌తో పాటు పలువురు నాయకులను, కార్యకర్తలను మాదాపూర్ పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ ఎల్లప్పుడూ ప్రజల తరఫున గళం విప్పుతుం దని, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై పోరాటాలు ఉధృతం చేస్తామని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మరబోయిన రవి యాదవ్, మమత, రామకృష్ణ గౌడ్, శ్రీకాంత్, శ్రీనివాస్, సంతోష్ పాల్గొన్నారు.

## అమ్మకానికి కోల్ ఇండియాలో 2 శాతం వాటా..!

## రూ.5 వేల కోట్ల సమీకరణకు కేంద్రం సిద్ధం




కోల్ ఇండియాలోని 2 శాతం వరకు వాటాను కేంద్ర ప్రభుత్వం ఆఫ్‌ఎస్ ద్వారా విక్రయించనుంది. ఒక్కో షేరుకు రూ.412 ఫ్లోర్ ప్రైస్ నిర్ణయించగా, దీని ద్వారా సుమారు రూ.5,000 కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. నాన్-రిటైల్ ఇన్వెస్టర్లకు మే 27న, రిటైల్ ఇన్వెస్టర్లకు మే 29న ఈ ఆఫర్ అందుబాటులోకి రానుంది.అమ్మకానికి కోల్ ఇండియాలో 2 శాతం వాటా..! రూ.5 వేల కోట్ల సమీకరణకు కేంద్రం సిద్ధంప్రభుత్వ రంగ బొగ్గు దిగ్గజ సంస్థ కోల్ ఇండియా లిమిటెడ్‌లోని తన వాటాలో 2 శాతం వరకు విక్రయించేందుకు కేంద్ర ప్రభుత్వం ముందుకొచ్చింది. ఆఫర్ ఫర్ సేల్ (ఆఫ్‌ఎస్) విధానంలో ఈ షేర్ల విక్రయం మే 27 నుంచి ప్రారంభం కానుంది. ఒక్కో షేరుకు కనీస ధరను రూ.412గా నిర్ణయించగా, దీని ద్వారా ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ.5,000 కోట్లు సమకూరనున్నాయి. ఈ ఓఎఫ్ఎస్‌లో మొదటిగా కంపెనీ ఈక్విటీలో 1 శాతం వాటాను విక్రయిస్తారు. అదనపు డిమాండ్ వచ్చిన పక్షంలో మరో 1 శాతం వరకు గ్రీన్ షూ ఆప్షన్ కింద విక్రయించే అవకాశం ఉంది. మొత్తం మీద దాదాపు 123.2 మిలియన్ షేర్లు మార్కెట్‌లోకి రానున్నాయి. నాన్-రిటైల్ ఇన్వెస్టర్లకు మే 27న, రిటైల్ ఇన్వెస్టర్లకు మే 29న ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుంది. పెట్టుబడులు, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ విభాగం అయిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ పబ్లిక్ అసెట్ మేనేజ్‌మెంట్ కార్యదర్శి అరుణిష్ చావ్లా సోషల్ మీడియా వేదిక ఎ?క్స్ ద్వారా ఈ వివరాలను వెల్లడించారు. కోల్ ఇండియా బలమైన ఆర్థిక పనితీరు, స్థిరమైన లాభాలు, ఆకర్షణీయమైన డివిడెండ్లతో దీర్ఘకాలిక పెట్టుబడిదారులకు మంచి అవకాశంగా కొనసాగుతోందని ఆయన పేర్కొన్నారు. మంగళవారం బీఎస్ఈలో కోల్ ఇండియా షేర్ ధర రూ.458.25 వద్ద ముగిసింది. దీంతో ఆఫ్‌ఎస్ ఫ్లోర్ ప్రైస్ ప్రస్తుత మార్కెట్ ధర కంటే దాదాపు 10 శాతం తక్కువగా ఉండటం పెట్టుబడిదారులకు ఆకర్షణీయంగా మారింది. సాధారణంగా ఇటువంటి డిస్కౌంట్ ధరలు రిటైల్ ఇన్వెస్టర్లను ఆకట్టుకుంటాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం చేపడుతున్న రెండో ప్రధాన ఆఫ్‌ఎస్ ఇదే. ఇటీవల సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలోని 8.08 శాతం వాటాను విక్రయించి కేంద్రం రూ.2,266 కోట్లు సమీకరించింది. ఇక 2026-27 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం పెట్టుబడుల ఉపసంహరణ, ఆస్తుల నగదీకరణ ద్వారా మొత్తం రూ.80,000 కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇది గత సవరించిన అంచనాలతో పోలిస్తే రెట్టింపుకు పైగానే ఉండటం గమనార్హం.